క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి

పాలసముద్రం : సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సింహరాజుపురం తహసీల్దార్ అరుణ కుమారి, రీసర్వే డీటీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామసభలో ఆర్‌డీఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా గ్రామసభలో సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే త్వరితగతిన పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ తంగరాజ్, వీఆర్‌ఏ మునస్వామి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓలు

నగరి: మండలంలోని అర్జునప్పకండ్రిగ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పీఎన్ శ్రీదేవి మంగళవారం వార్షిక తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఆమె పరిశీలించారు. ఏకోపాధ్యాయ పాఠశాల అయినప్పటికీ విద్యా ర్థులు ప్రతిభా పాటవాలు కలిగి ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు జి.విజయసంధ్యను అభినందించారు. రిజిస్టర్లు కూడా సక్రమంగా నిర్వహిస్తున్నారని ఆమె కితాబిచ్చారు. మన బడి-భవిష్యత్ కార్యక్రమంలో పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. విద్యార్థు లు ఆంగ్ల మాధ్యమంలో రాసే నైపుణ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంఈఓ-2 బి.నమశ్శివాయం, సీఆర్పీ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి

గంగాధర నెల్లూరు : మండలంలోని అగరమంగళం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్యాన్సర్‌పై బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ రూరల్ యాక్షన్ సంస్థ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సంస్థ సెక్రటరీ చిట్టిబాబు మాట్లాడుతూ ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే నివారించే అవకాశముందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, అవసరమైన జాగ్రత్తలతో ఆరోగ్యంగా జీవనం సాగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సోమలరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.శివరాజు, డేనియల్, శ్రీధర్, ఎంఈఓ-2 గుణశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, సుహాసిని, గంగాధరం, ప్రోగ్రామ్ అనలిస్ట్ శాలిని పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

వెదురుకుప్పం : మండల కేంద్రంలోని ఐటీఐ (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో 2024-2025 విద్యాసంవత్సరానికి గాను 5వ విడత అడ్మిషన్లు చేపట్టినట్లు ప్రిన్సిపల్ భైరవుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్‌లకు సంబంధించి ఐటీఐలో చేరదలచిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ సాయంత్రం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 28న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. ఇతర వివరాలకు 9533723022, 9492571731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే రుణాలు



మాట్లాడుతున్న ఏజీఎం ప్రకాష్

పాలసముద్రం : డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికే స్త్రీ నిధి రుణాలు అందిస్తున్నట్లు స్త్రీ నిధి ఏజీఎం ప్రకాష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకే స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే సక్రమంగా కంతులు చెల్లించాలని కోరారు. సంఘమిత్రలు రుణాల రికవరీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మండలంలో రూ.3,74,53,700 స్త్రీనిధి రుణాల రికవరీ ఉందని వివరించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

పల్లెల్లో వీధులు అపరిశుభ్రంగా దుర్వాసన వెదజల్లుతున్నాయి.. డ్రైనేజీలు చెత్తా చెదారాలతో నిండిపోయాయి. తడి పొడి చెత్త సేకరణ వాహనాలు నిరుపయోగంగా మారిపోయాయి. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయి.. రోగాలు తీవ్రంగా ప్రబలుతున్నాయి. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం లేదు.

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- రోడ్లపై చేరుతున్న మురుగు
- నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



మరమ్మతులకు నోచుకోని ఈ ఆటోలు

శ్రీరంగరాజపురం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. డ్రైనేజీలు వ్యర్థాలతో నిండిపోయి మురుగు రోడ్లపైకి చేరుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పారిశుద్ధ్య కార్మికులు సైతం తూతూ మంత్రంగా పనిచేస్తున్నారు. దీంతో చెత్త సేకరణ వాహనాలు మూలన పడ్డాయి. వర్మీకంపోస్టు యార్డు నిరుపయోగంగా మారిపోయింది.

అగమ్యగోచరంగా చెత్తసేకరణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. వారు విధిగా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును శుభ్రం చేసేవారు. ఆటోలు, చెత్త సేకరణ బండ్లతో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేవారు. అయితే ఇప్పుడు గ్రీన్ అంబాసిడర్లు కనిపించడం లేదు. చెత్త తరలించే వాహనాలు సైతం పనిచేయడం లేదు. దీంతో చెత్త సేకరణ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నిరుపయోగంగా వర్మీకంపోస్టు యార్డు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పంచాయతీలో ఒక వర్మీకంపోస్టు యార్డు ఏర్పాటు చేసింది. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించేవారు. ఆ వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించేవారు. ఇప్పుడు ఆ యార్డులు నిరుపయోగంగా మారిపోయాయి. మందుబాబులకు అడ్డాగా తయారయ్యాయి.

పకడ్బందీగా చర్యలు



గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పకడ్బందీగా చర్యలు చేపడతాం. చెత్తసేకరణ వాహనాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం. ఖాళీగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేస్తాం. దోమల వ్యాప్తి నివారణకు కృషి చేస్తాం. డంపింగ్ కేంద్రాలను వాడుకలోకి తీసుకువస్తాం. ఈ మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇప్పిస్తాం. – మోహన్‌మురళి, ఎంపీడీఓ, శ్రీరంగరాజపురం







మందుబాబులకు అడ్డాగా మారిన చెత్త సేకరణ కేంద్రం, నిరుపయోగంగా ఉన్న డంపింగ్ కేంద్రం, గత ప్రభుత్వంలో చెత్తను సేకరిస్తున్న కార్మికులు

మృతుల కుటుంబాలకు పరామర్శ



శ్రీరాములునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని డీకే మర్రిపల్లెకు చెందిన ట్రాన్స్‌కో లైన్‌మన్ నాగారాజు సోమవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటనే గ్రామానికి వెళ్లి నాగరాజు మృత దేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. అలాగే కటికపల్లెకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్నపాపమ్మ అనారోగ్యంతో మరణించారు. ఆమె మృతదేహనికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కుటుంబీకులను ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్కొండయ్య, మాజీ సర్పంచ్ ముత్యాలు, పార్టీ మండల కన్వీనర్ మణి, స్థానిక నాయకులు సురేష్, జనార్దన్, మణి, ఢిల్లీయ్య, అమావాసయ్య, భాస్కర్, రాజశేఖర్‌రెడ్డి, మహేష్,బాబు, గండు, జయ పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురం : నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరాములునాయుడు సేవలు మరువలేం

కార్వేటినగరం : జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాయలచెరువు శ్రీరామ నాయుడు సేవలు మరువలేమని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి కొనియాడారు. మంగళవారం గాండ్ల మిట్ట కూడలి వద్ద శ్రీరాములు నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్వేటి నగరం మండల అభివృద్ధికి శ్రీరాములు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడిగా, గ్రామ సర్పంచ్‌గా, టెలికాం మెంబర్, కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుడిగా, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడిగా విశేష సేవలందించారని వివరించారు. అనంతరం ఎంపీపీ లతా బాలాజీ ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

కార్వేటినగరం : తిరుపతి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ జయ ప్రసాద్, జ్యోతిర్మయి ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీపీ లతా బాలాజీ ప్రారంభించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయ వర్మ, పార్టీ మండల కన్వీనర్లు శేఖర్ రాజు, పద్మనాభ రెడ్డి, సర్పంచులు గుణవతి లోకనాథం నాయుడు, మంగమ్మ, పట్నం ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దేవకీ లోకనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు లోకనాథరెడ్డి, కృష్ణ యాదవ్, మోహనమ్మ, ఆకుల గోపి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సుగుణమ్మ, గిరిజ, యశోద రెడ్డి పాల్గొన్నారు.

500 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా స్థావరాలపై దాడి చేస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం : సారా తయారీ స్థావరాలపై దాడి చేసి దాదాపు 500 లీటర్లు సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. చిన్నతయ్యూరు గ్రామంలో సారా స్థావరాలు ఎక్కువగా ఉన్నాయని అందిన రహస్య సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా సారా తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేటి యువత ఎక్కువగా మద్యానికి బానిసై జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో యువతే ఎక్కువగా చనిపోతున్నారని తెలిపారు. సారాకు బానిసైతే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు.

ఏజీపీకి సత్కారం

నగరి: నూతనంగా ఎన్నికైన ఏజీపీ ఎంజే జగదీశన్‌ను నగరి బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బార్ ఉపాధ్యక్షులు ఈజీ బాబు, సహకార్యదర్శి అరుళ్, న్యాయవాదులు ఎస్.సుబ్రమణ్యం, ఎన్.మహదేవన్, కె.వేలాయుధం, రాము, ధరణి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు తొలగింపు



జేసీబీతో ట్యాంకును తొలగిస్తున్న దృశ్యం

పాలసముద్రం : మండలంలోని రంగాపురం ఆదిఆంధ్రవాడలో శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకుని మంగళవారం తొలగించారు. సర్పంచ్ అనురేఖ మాట్లాడుతూ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో సొంత నిధులు వెచ్చించి తొలగింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తామని వివరించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



విద్యార్థులకు చేస్తున్న రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

పుత్తూరు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారని, పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యను దూరం చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య అన్నారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీలో నూతనంగా చేరిన విద్యార్థినీ విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. విద్యార్థుల రక్త గ్రూపు, రక్తహీనత తదితర వివరాలను తెలియచేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ రక్త గ్రూపును తెలుసుకున్న పక్షంలో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో బోటనీ అధ్యాపకులు డాక్టర్ జే.కోటేశ్వరరావు, ఎస్.పద్మావతి, మైక్రోబయాలజీ అధ్యాపకులు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అందని పుస్తకాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల భవితను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను పునః ప్రారంభించి నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా పాత పుస్తకాలతోనే బోధనను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

- పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్న వైనం
- కేంద్రాలపై కూటమి ప్రభుత్వం ఉదాసీనత
- గత ప్రభుత్వ పాలనలో సత్ఫలితాలు



అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు పాతపుస్తకాలతో...

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ సీడీపీఓ పరిధిలో 227 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు నిత్యం 9,344 మంది చిన్నారుల వరకు వస్తున్నారు. ఇందులో మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 5వేల మంది ఉంటున్నారు. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. ఈ కేంద్రాల చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాలుగు పుస్తకాలను బర్డ్స్-1, కిట్లను అందజేసింది. వీటి వల్ల ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రమూ తగ్గకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇంగ్లిష్‌లో విద్యాబోధన చేసేవారు. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్స్ సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన అంగన్‌వాడీ చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్ (ఫైల్) పీపీ-1 కిట్లు , నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందజేసింది. ఇవన్నీ మంచి ఫలితాలు ఇచ్చాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలకు మంగళం పాడింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్య పుస్తకాల పంపిణీని పూర్తిగా నిలిపివేసింది.

కొంతమంది అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతో బోధన కొనసాగిస్తున్నారు. చిన్నారులకు ఆయా పుస్తకాల్లోని బొమ్మలను చూపించి అర్థమయ్యే విధంగా వివరిస్తుంటే వారికి చక్కని విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పుస్తకాల పంపిణీ ఆగిపోయి తమ చిన్నారుల భవితకు అవరోధంగా మారిందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రైవేటుకు ఊతం

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను పరోక్షంగా ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్వహించే ప్రీ స్కూల్లో చేరిన విద్యార్థులు ఆ తర్వాత ఆ విద్యాసంస్థల్లో కొనసాగుతుంటారు. చిన్నారులను అలవాటు చేసేందుకు ప్రీ స్కూల్లో చేరుస్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బలోపేతానికి ప్రభుత్వం ఊతమిచ్చే చర్యలకు స్వస్తి పలికితే తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేర్పించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పుస్తకాలు త్వరలో వస్తాయి

పుస్తకాలు త్వరలో వస్తాయని రాష్ట్రస్థాయి అధికారులు చెప్పారు. పుస్తకాలు వచ్చిన తర్వాత వాటిని పంపిణీ చేస్తాం. ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతో విద్యాబోధన చేస్తున్నారు. బోధనకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. త్వరలోనే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయి. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

-శ్యామ్ సుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

పిల్లల గణన సర్వే ప్రారంభం



మాట్లాడుతున్న డీఐఓ హనుమంతరావు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం పిల్లల గణన సర్వే ప్రారంభించిందని డీఐఓ హనుమంతరావు చెప్పారు. మంగళవారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఐదేళ్లలోపు, 5 నుంచి10 ఏళ్ల పిల్లల గణన సర్వేకు మంగళవారం నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు క్షేత్రస్థాయిలో ఈ సర్వేను చేస్తారన్నారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు? పుట్టిన వారిలో ఎవరైనా మరణించారా? బతుకుదెరువు కోసం వలస వచ్చిన కుటుంబంలో ఎవరైనా పిల్లలున్నారా? బయట రాష్ట్రాల నుంచి ఎంత మంది పిల్లలు వచ్చారు? జిల్లా నుంచి ఎంత మంది పిల్లలు బయట ప్రాంతాలకు వెళ్లిపోయారు? అనే అంశాలపై సర్వే చేస్తారని వివరించారు. ఈ సర్వే ఆధారంగా వారందరికీ సకాలంలో టీకాలు వేయించారా, లేదా? అనేది తెలుస్తుందన్నారు. దీని ఆధారంగా త్వరలో ప్రారంభమయ్యే మిషన్ ఇంద్ర ధనస్సులో టీకా తప్పిన పిల్లలకు వాటిని వేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది విధిగా నవంబర్ 10వ తేదీలోపు సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

అప్రమత్తతతోనే ఆనందం



కుశస్థలి నది సమీపం టపాకాయల విక్రయాలు

- అజాగ్రత్త ప్రమాదకరం
- దీపావళి టపాసుల విషయంలో నిర్లక్ష్యం వద్దు
- ప్రజలకు అధికారుల సూచన

నగరి: వయోబేధం లేకుండా ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే దీపావళి పండుగకు ఇక కొన్ని రోజులు మాత్రమే ఉంది. ఈ నెల 31న దీపావళి రోజున బాణసంచా కాలుస్తూ సందడి చేసేందుకు ఇప్పటి నుంచే ఉత్సాహంతో ప్రజలు ఉన్నారు. అయితే అందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఆనంద దీపావళి అవుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్టే. బాణసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు.

చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు అధికంగా ఉంటాయి. అటువంటి ప్రాంత్రాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదు.
- పండగ ఆనందంలో పిల్లల విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవిత కాలం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు.
- సాధ్యమైనంత వరకూ పెద్దల పర్యవేక్షణలో పిల్లలతో టపాసులు కాల్పించాలి.
- కొంతమంది కొన్ని రకాల టపాసులను రోడ్లపై కాల్చేందుకు ప్రయత్నిస్తారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇరుకు ప్రాంతాల్లో ఉండే సీసీ రోడ్లలో ఈ విధమైన ప్రమాదాలు అధికంగా జరిగే ఆస్కారం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రహదారులపై టపాసులను వెలిగించరాదు.

వ్యాపారులు పాటించాల్సిన నియమాలు

- జన సంచారం లేని ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేయాలి.
- అనుకోని ప్రమాదాలు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా విశాలమైన మార్గం ఉంటే మంటలను త్వరగా ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బందికి అనువుగా ఉంటుంది.
- టపాకాయలు విక్రయించే వ్యాపారులు పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ. ట్రాన్స్‌కో శాఖల అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు. కార్బన్‌డయాక్సైడ్ వాయువును అందుబాటులోఉంచుకోవాలి.
- దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చనీయకుండా పొగ తాగరాదు అని బోర్డులను ఏర్పాటు చేయాలి.
- సెల్‌ఫోన్ మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలి. దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండేలా చూడాలి.
- మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్తు సంబంధించిన వైరింగు సక్రమంగా ఉండేలా జాగ్రత్త వహించడంతో పాటు సాధ్యమైనంత వరకూ ఎల్‌ఈడీ బల్బులు వాడటం మంచిది.
- ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక. అగ్ని మాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఉండాలి.

అప్రమత్తంగా వ్యవహరించాలి



తగిన జాగ్రత్తలతో దీపావళి పండుగ జరుపుకోవాలి. పిల్లలు బహిరంగ ప్రదేశంలో పెద్దల సమక్షంలోనే టపాకాయలు కాల్చేలా జాగ్రత్త పడాలి. ప్రమాదాలకు ఆస్కారం ఉంటే చుట్టుపక్కల ఉన్న వారు సైతం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత వరకూ ప్రమాద నివారణకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికిగానీ 9963737024, 08677236122 108కు గానీ, పోలీసు స్టేషన్‌కు గానీ సమాచారమివ్వాలి.

– సుబ్బరాజు, అగ్నిమాపక అధికారి, నగరి మండలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయించినా, నిర్దేశించిన ప్రాంతాల్లో కాక ఎక్కడబడితే అక్కడ టపాకాయలు విక్రయించినా చర్యలు తప్పవు. నిర్ణీత స్థలంలోనే టపాకాయలు విక్రయించాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే, లైసెన్సు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అలా విక్రయించినవారిపై కేసు నమోదు చేశాం. టపాసులు అక్రమంగా ఇళ్లలో నిల్వ ఉంచితే వారికే ప్రమాదం. అవి పేలడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది.

– మహేశ్వర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, నగరి